

సంబరాల సంక్రాంతి

సంబరాల సంక్రాంతి వచ్చింది. ఊరూ.. వాడా.. పట్టణం.. నగరం.. అనే తేడా లేకుండా సందడి మొదలైంది. మహిళలు ఇప్పటికే పిండి వంటలు పూర్తి చేసుకుని పండగ పూజలకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో గంగిరెద్దుల వారి సన్నాయిలు, హరిదాసుల కీర్తనలు ప్రారంభమయ్యాయి. యువతులు తమ వాకిళ్లను ముగ్గులతో నింపుతున్నారు. బాలలు గాలిపటాలతో హల్‌చల్ చేస్తున్నారు. మూడు రోజుల పండగను ముచ్చటగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా వాసులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

6,7 పేజీల్లో



రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లాలో 12వేల ఎకరాలకు నీరందించేందుకు ప్రత్యేక కృషి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అభివృద్ధి, రైతాంగ సంక్షేమం ప్రభుత్వం లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శని వారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రుణ మాఫీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై కార్యాచరణ సిద్ధం చేసి, అమలుకు శ్రీకారం చుడితే ప్రజలను అపోహలు, ఆందోళనలకు గురిచేసే కుట్రలు చేశాయని ఆరోపించారు. ప్రభుత్వం మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా, సాగుభూమికి రూ.12వేలు ఏడాదికి ఇచ్చేలా జనవరి 26 నుంచి పథకం అమలుకు సిద్ధం అవుతోందన్నారు. సన్నవడ్లకు కూడా రూ.500 బోనస్ ఇస్తున్న ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ధర్మపురి, బీర్‌పూర్ మండలాలకు సాగునీరు అందించే రోళ్లవాగు ఆధునీకరణ సైతం ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమస్యలు పరిష్కరించామన్నారు. గోదావరి నదిలో డిసెంబర్, జనవరి లోనే నీరు లేకపోవడంతో లిఫ్ట్‌లపై ఆధారపడ్డ రైతుల దుస్థితి ప్రశ్నార్థకంగా మారిందని దీంతో 11,946 ఎకరాలకు నీరందే అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అవసరం ఉన్న సాగుకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తే, సుమారు 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని త్వరలోనే నీరు విడుదలయ్యి ఇబ్బందులు తొలగుతాయన్నారు. గత అనంతరం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరిలో నీరులేకపోవడంతో ఎత్తిపోతలపై ఆధారపడ్డ రైతులకు ఇబ్బంది ఏర్పడిందని, కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష నిర్వహించి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన అనుభవంతో పంటల సాగుకు నీటి విడుదలకు ఇంజనీయర్లు, అధికారులను ఒప్పించి, మెప్పించి నీటి విడుదలకు కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర బాధ్యులు బండ శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మండల బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మాజీ కౌన్సిలర్ పుప్పాల అశోక్, రాధాకిషన్‌రావు, పూర్ణచందర్‌రెడ్డి, స్వామిరెడ్డి, శైలేందర్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి, పక్కన విప్ లక్ష్మణ్‌కుమార్

రిటైర్డ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ్ కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి) జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల క్యాలెండర్‌ను జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి శని వారం ఆవిష్కరించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎల్లా గంగారాజం మాట్లాడుతూ క్యాలెండర్ ప్రింటింగ్‌కు సహకరించిన వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. జగిత్యాల పట్టణంలోని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, అయిల్నేని ఆసుపత్రులలో ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉన్నందున ఉద్యోగులు, పెన్షనర్లు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్‌కుమార్, అయిల్నేని సుమన్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దమ్మన్న పేట, రాజారాం, జైనా గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులను కలిసి వారితో మాట్లాడారు. గోదావరి నదిలో నీరులేక రైతులు పడుతున్న ఇబ్బం దుల గురించి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లా మన్నా రు. గోదావరి నదిలో ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని కోరి నట్లు తెలిపారు. ఈవిషయంపైన వెంటనే స్పందించి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఎస్సారెస్పీ అ ధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ మధ్యాహ్నం నీటిని గోదావరి నదిలో విడుదల చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవరం లేదన్నారు. మంత్రిగా ఉన్న ఈశ్వర్ మేడారం రిజర్వాయర్ ద్వారా సిరిసిల్లకు, సిద్దిపేటకు హరీ‌ష్‌రావు నీటిని తరలిస్తున్న ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనబట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మరవీందర్, మండలకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, మాజీ ఎంపీటీసీ తోడేటి గంగాధర్‌గౌడ్, తిరుపతి, అశోక్, మధుకర్‌రెడ్డి, భువనేశ్వర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులు జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం బాధ్యులు మాట్లాడుతూ జీవో నెం 3 ద్వారా తెలంగాణ చేనేత అభయ హస్తంలో ఉన్న నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా అమలు చేయడం శుభపరిణామం అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వా ని కి, సీఎం రేవంత్‌రెడ్డికి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలి పా రు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొక్కుల గంగారాజం, బాధ్యులు కడకుంట్ల గంగారాజేశ్వర్‌తో పాటు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ పనిచేసిన హయాంలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శని వారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫార్ములా కేసుతో కేటీఆర్‌ను ఇబ్బందిపెట్టే ప్రయత్నం మానుకోవాలని, ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎదుర్కోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆత్మగౌరవ చిహ్నాలను మార్చడం తప్ప అధికార కాంగ్రెస్ చేసిందేమి లేదన్నారు. రైతు రుణమాఫీ పూర్తి కాలేదని, భరోసాను సైతం రూ. 15వేలు ఇస్తామని ప్రకటించి రూ.12 వేలకే కుదించారన్నారు. హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాల పై ప్రశ్నిస్తున్నందునే మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టే కుట్రలు చేస్తూ ప్రజల దృష్టిని మరల్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారని ఆరో పించారు. వరినాట్లు ప్రారంభం అయిన ఇంకా నీటి విడుదల చేయడం లేదని తక్షణమే రిజర్వాయర్‌లు నింపి, వాటి ద్వారా చెరువులు, కుంటలు నింపడంతో పాటు, ఎత్తిపోతల పథ కం ద్వారా నీరు అందించాలన్నారు. అంతకు ముందు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మా ట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 0.25 టీఎంసీగా ఉన్న రోళ్లవాగు ప్రాజెక్టును 1 టీఎంసీగా పెంపునకు బీజం వేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్ననాడు రోళ్ల వాగును ఎందుకు ఆధునీకరించ లేదని ఆమె ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయ కులు గట్టు సతీష్, ఆనందరావు, తేలు రాజు, బర్కం మల్లేష్‌యాదవ్, సాగి సత్యంరావు, చాంద్ పాషా, నరేష్, వొడ్నాల జగన్, రమేష్, చందు, సత్యం తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు, వసంత

జీవో నం. 51 రద్దు చేయాలి

విప్, ఎమ్మెల్సీలకు గ్రామపంచాయతీ ఉద్యోగుల వినతి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జీవో.నం 51ని రద్దుచేసేలా చొరవ చూపాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇచ్చేందుకు గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు అందించాలని సీఎస్‌కు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసినందుకు ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. జీవో నంబర్ 51 రద్దుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు కిరణ్‌రెడ్డి, ప్రశాంత్, శంకర్, భరణి, గంగాధర్, సురేందర్, శ్రీనివాస్, కైలాసం, గోపాల్, సాగర్, సత్తవ్వ తదితరులున్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

జిల్లా మెప్మా పరిపాలన అధికారి శ్రీనివాస్ గౌడ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలన చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాము..స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన రుణాలు అందించి ప్రోత్సహించడంతో పాటు.. విజయవంతంగా వ్యాపారాలు, ఉపాధి నిర్వహించి రాణించేలా కృషి చేస్తున్నామని జిల్లా మెప్మా పరిపాలన అధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మెప్మా శాఖ పరంగా చేపడుతున్న కార్యక్రమాలు, పట్టణ మహిళల అభ్యున్నతి, పేదరికం సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మెప్మా పరిస్థితి ఏమిటీ..? ప్రభుత్వ లక్ష్యాలను సాధించడానికి ఎలా ముందుకు వెళ్తున్నారు..?

అధికారి: కలెక్టర్ సత్య ప్రసాద్ ఎప్పటికప్పుడు అందిస్తున్న దిశా నిర్దేశం మేరకు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. స్వయం సహాయక మహిళా సంఘాలకు, అందులోని సభ్యులకు అవసరమైన రుణాలు అందించడం, స్వయం ఉపాధి పథకాల వైపు ప్రోత్సహించడం వంటివి జరుపుతున్నాము. స్వయం సహాయక సంఘాల పనితీరును ఎప్పటికప్పుడు పక్కాగా పర్యవేక్షిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే రుణాలు, రికవరీలలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలున్నాయి...నివారణపై దృష్టి సారించారా..?

అధికారి: ఇటీవల జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో మెప్మా పథకాల అమలులో ఎలాంటి అవకతవకలు జరిగినట్లుగా వెలుగులోకి రాలేదు. గతంలో జరిగిన పలు సంఘటనలపై చర్యలు తీసుకున్నాము. ఏదైనా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో చేపడుతున్న నూతన కార్యక్రమాలు ఏమిటీ..?

అధికారి: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీ యూనిట్లను ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నాము. వివిధ రకాల పండ్లను నిల్వ చేసుకునే విధంగా కనీసం రెండు యూనిట్లు ప్రారంభించాలన్న యోచనతో ఉన్నాము. అదే విధంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాము.

దరఖాస్తుల ఆహ్వానం

కొడిమ్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో చేరుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మోడల్ స్కూల్‌లో చేరేందుకు ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు, ఫొటో, స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో 7, 8, 9, 10 తరగతులలో మిగులు సీట్ల భర్తీకి గాను దరఖాస్తు చేసుకోవ చ్చునని తెలిపారు. వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

మల్లాపూర్, జనవరి, 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవుపేట, చిట్టాపూర్, గుండంపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఇటీవల అడువాలా రాజన్న, బొల్లె మల్కవ్వ, సత్యమ్మ, ఎల్లాలరెడ్డి, గొర్రె రాజంలు వివిధ కారణాలతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోరుట్లలో కూడారై ఉత్సవం


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

కోరుట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అతిపురాతన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కుడార్రై (ఇత్తడి గంగాలం) ఉత్సవం వైభవోపేతంగా జరిగింది. ఉదయం 5 గంటలకు తిరుప్పావై సేవ, కలశ పూజ ఆలయ అర్చకుడు బీర్నంది వైదిక నిర్వహణలో జరిగాయి. స్వామివారిని మొదట పల్లకిలో ఊరేగింపుగా తెచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, అండాళ్ గోష్టి బృందం, భక్తులు పాల్గొన్నారు.

మాన్వూర్ వాగు నీటి విడుదల

మెట్‌పల్లి రూరల్, జనవరి, 11 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని మాన్వూర్ వాగు ప్రాజెక్టు నుంచి శనివారం నీటిని అధికారులు విడుదల చేశా రు. అధికారులు శనివారం మాన్వూర్ వాగు గేట్లు ఎత్తి మండలంలోని కోంద్రికర్ల పెద్దవాగు ద్వారా రాయికల్ గోదా వరి లోకి నీరును విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఈఈ నారాయణరెడ్డి, డీఈ అరుణోదయ్, పాల్గొన్నారు.

వైభవంగా.. గోదాదేవి రంగనాథుల కల్యాణం


మెట్‌పల్లి పట్టణంలో తాళి చూపుతున్న అర్చకులు

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో గోదారంగనాథుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి కల్యాణ వేడుకలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం జరిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేడుకలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

-మెట్‌పల్లి టౌన్/మల్లాపూర్/కథలాపూర్/కోరుట్ల రూరల్/ఇబ్రహీంపట్నం


రాఘవుపేటలోని వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు దంపతులు


దూలూరులో కల్యాణంలో పాల్గొన్న భక్తులు..


వేములకుర్తిలో గోదాదేవి రంగనాథులు కల్యాణం

విద్యాసంసల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు


ది గ్రావిటీ పాఠశాలలో భోగి మంటలతో చిన్నారులు

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని శ్రీ ఎస్ఎస్‌వి జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు ఏర్పాటు చేసి, గాలిపటాలు ఎగరవేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే, ఎస్ఎస్‌వి విద్యాసంస్థల ఛైర్మెన్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ పల్లెర్ల నరేష్, ఆర్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, ఎస్ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మునీంధర్‌రెడ్డితో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

●పట్టణంలోని కృష్ణానగర్‌లో గల దిగ్రావిటీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, పోషకులు భోగి మంటలు కాలుస్తూ ఆట, పాటలతో సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ సంధ్యారాణి పాల్గొన్నారు.

●పట్టణంలోని సెయింట్ థెరిస్సా హై స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మోనా రాబర్ట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో శనివారం రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (హెచ్ 58) జిల్లా కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రకాశ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తీర్మానం చేశారు. జిల్లా అధ్యక్షులుగా సల్మాన్‌రాజ్, కార్యదర్శిగా బండ రాజవీర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సదయ్య, ఉపాధ్యక్షులుగా రాంబాబు, కోశాధికారిగా శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా మధుకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండి రమేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా కిష్టయ్య, కోశాధికారిగా శ్రీకాంత్ అదే విధంగా మెట్‌పల్లి, డివిజన్, సిటీ సర్కిల్ విభాగంలో ఎన్నికలు నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొడిమ్యాల, జనవరి11(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం కొడిమ్యాల తాజామాజీ సర్పంచు ఏలేటి మమత నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో(సర్పంచ్ కప్)క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మండల స్థాయిలో నిర్వహించు ఈ టోర్నమెంట్‌కు 22 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విజేత జట్టుకు 20 వేలరూ పాయలు, రన్నరప్ జట్టుకు 10 వేల రూపాయలను ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు మమతనర్సింహరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ. సల్మాన్, కృష్ణంరాజు, అఖిల్, నరేష్‌గౌడ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

వివేకానందుడిని స్ఫూర్తితో ముందుకు సాగాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

కోరుట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచానికి గొప్ప సందేశాన్ని ఇచ్చిన స్వామి వివేకానందుడిని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులు సూచించిన మార్గంలోనే పయనించాలని సూచించారు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని, హైందవ మత కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప యోధుడైన వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు వివేకానందుని ఆశయాలు, ఆలోచ నల గురించి నాటక రూపంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరెడ్డి హరిష్వరణరెడ్డి, బొడ్ల శ్రీనివాస్, ప్రబంధ కారిణి అధ్యక్షుడు వేముల రవికిరణ్, ఉపాధ్యక్షుడు రాజ గంగాధర్, ప్రధాన ఆచార్యులు గోపు వెంకటేశ్, ఆచార్య బృందం పాల్గొన్నారు.

చెరువులో కట్టడం

మల్యాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట పరిధిలోని కొండగట్టు సమీపంలో గల తుమ్మ చెరువు వెనుక వైపులో కొందరు నిర్మాణాలు చేపట్టారు. హద్దుల కోసం గోడ నిర్మాణం కోసం పునాది కందకాలు తవ్వారు. ఈ నిర్మాణం పూర్తిగా చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉండగా కట్టడం కోసం చేపట్టిన పనులపై స్థానిక ముదిరాజు కులస్తులు మండిపడుతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో నిర్మాణాలు నిషేదం అయినప్పటికీ కట్టడాలు చేపట్టడంతో చెరువుకు ముంపు వాటిల్లుందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్‌ను సంప్రదించగా నిర్మాణాలు చేపట్టవద్దని, చేపడితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. కాగ నిర్మాణ పనులను నిలిపివేయించినట్లు పంచాయితీ కారోబార్ రాజేశ్వర్ అన్నారు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గొల్లపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ముత్యాల్ల హన్మంతు (72) అనే వృద్ధుడు అనారోగ్యంతో జీవితం మీద విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. హన్మంతు భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కూడారై ఉత్సవం..



ధర్మపురి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై పాశురం వేడుకల సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలోని శేషప్ప కళావేదిక ఎదుట మహిళలు కూడారై నోములు, వ్రతాలు చేసుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..



కథలాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెటలో ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్థులు శనివారం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూషణరావుపేటకు సొసైటీలో పనుల కోసం వెళ్ళాల్సి వస్తోందని విన్నవించారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి..



గొల్లపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపునకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని డిప్యూటి డీఎంహెచ్‌వో ఎన్. శ్రీనివాస్ వైద్యారోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. శనివారం గొల్లపల్లి మండలం రాపల్లె ఉపవైద్య కేంద్రంను డిప్యూటి డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు.

టోర్నమెంట్ ప్రారంభం..



మల్యాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన ఒడ్డెపల్లి అనురాధ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2ను మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ ప్రారంభించారు. ఆరు రోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. స్పాన్సర్‌గా ఒడ్డెపల్లి శ్రీనివాస్, శశాంక్ వ్యవహరిస్తున్నారు.

బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడిగా బొడ్ల రమేష్


ఎంపీ అర్వింద్‌ను కలిసిన రమేష్

మెట్‌పల్లిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడిగా బొడ్ల రమేష్‌ను రెండవ సారి నియమిస్తూ బీజేపీ జిల్లా నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు మోరపల్లి సత్యనారయణ, నియోజకవర్గ నాయకులు డా.రఘు, సరభి నవీన్‌రావకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మల్లేశం


మల్లేశంను అభినందిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

మల్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల బీజేపీ అధ్యక్షుడిగా గాజుల మల్లేశం నియమితులయ్యారు. శనివారం ఎన్నికల అధికారి కాశం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. బూత్ కమిటీల అభిప్రాయాల మేరకు మల్లేశంను అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మల్లేశం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కథలాపూర్ మండల అధ్యక్షుడిగా మారుతి



కథలాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా సిరికొండకు చెందిన మల్యాల మారుతిని నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కథలాపూర్ మహేశ్‌ను నియమించారు. మండల మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్ రావు, కంటె రాజం, ప్రసాద్ ఉన్నారు.

●నూతనంగా ఎన్నికైన బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు పార్టీ బలేపేతానికి కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. శుక్రవారం హైదారాబాద్‌లో ఆయనను బొడ్ల రమేష్ కలిసి కృతజ్ఞతాలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కొడిమ్యాల, జనవరి11(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంగడి బజారులో శనివారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో యంగ్‌ఇండియాకె బోల్ పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ యువతలో ప్రశ్నించే గొంతుకల కోసం, ప్రజాస్వామ్య విధానాల్లో పాల్గొనటం కోసం ఈ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా కె బోల్ పేరుతో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించేందుకుగాను ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు గొల్కొండ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వామి, తిర్మలేష్‌యాదవ్, శ్రీనివాస్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

అలిశెట్టి రచనలు అక్షర దీపికలు

సినీ నటుడు బలగం సత్తన్న

పాతికేళ్లుగా కళాశ్రీ సంస్థ అలిశెట్టి పురస్కారాలు..


అలిశెట్టి అవార్డులు ప్రధానం చేస్తున్న అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : అలిశెట్టి ప్రభాకర్ రచనలు అక్షర దీపికలు అని ప్రముఖ సినీ నటుడు బలగం సత్తన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని సుఖీభవ హాల్లో కళాశ్రీ సాహితీవేదిక అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ అక్షర సూరీడు స్వర్గీయ అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా అలిశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడారు. తెలంగాణ అలిశెట్టి పురస్కారాలను డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, డాక్టర్ పొన్నం రవిచంద్ర, గాయకుడు మురళీమధు, డాక్టర్ రాధ కుసుమ, డాక్టర్ వాణి, మాదారపు వాణిశ్రీలకు అతిథుల చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేశారు. చిన్నారి సేజల్ సాన్వి భరత నాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ప్రోగ్రాం కన్వీనర్ ఏవీఎన్ రాజు, సంధాన కర్తలు మద్దెల సరోజన, అనిత, లక్ష రాజు, జమున, సునీత, తదితరులున్నారు.

పాతికేళ్లుగా పురస్కారాలు అందిస్తున్నాం..

జగిత్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్లుగా జగిత్యాలకు చెందిన కళాశ్రీ సాహితీ వేదిక సంస్థ అలిశెట్టి ప్రభాకర్ స్మారకార్థం రాష్ట్ర స్థాయి అలిశెట్టి పురస్కారాల ప్రధానం చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 500 మందికి పైగా సాహితీ వేత్తలు, కవులు, కళాకారులకు కళాశ్రీ సాహితీ వేదిక నిర్వాహకులు రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందజేశారు.

పురస్కారం అందుకోవడం మరిచిపోలేను

డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, కవి, జగిత్యాల



అలిశెట్టి సాహితీ రంగంలో తనదైన చెరగని ముద్ర వేసుకున్న అక్షర సూరీడు అలిశెట్టి సాహితీ పురస్కారం స్వీకరించడం ఆనందంగా ఉంది. ప్రస్తుత యేడాది కళాశ్రీ సాహితీ వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అలిశెట్టి కవితా పోటీల బహుమతుల సందర్భంగా తెలంగాణ కీర్తి సాహితీ పురస్కార ప్రధానాన్ని అందుకోవడం మరిచిపోలేని అనుభవంగా ఉంది.

అలిశెట్టి సేవలు చిరస్మరణీయం..

గుండేటి రాజు, కళాశ్రీ సాహితీ వేదిక నిర్వాహకులు



పాతికేళ్లుగా అలిశెట్టి స్మారకార్థం రాష్ట్ర స్థాయి పురస్కారాలను జగిత్యాల కేంద్రంగా అందిస్తున్నాము. సాహితీ రంగంలో అలిశెట్టి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తున్నాయి. ఆయన కవిత్వం ఓ పాశుపతాస్త్రం. సామాన్యుని కష్టాలే ఆ కలం కవితా వస్తువులు..కష్ట జీవి కన్నీళ్లే ఆ పెన్నుకు ఇంకు చుక్కలుగా మారాయి.

ప్రజల ఆరోగ్యం కోసమే ఓపెన్ జిమ్


జిమ్‌లో వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, జనవరి, 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్య ఇబ్బందుల బరిన పడకుండా ఎక్సైజ్ చేయడానికి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ నిధులు రూ. 5లక్షలతో మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిమ్ చేస్తూ అందరిని ఉత్సాహపరిచారు. పిల్లలతో పాటు ప్రజలు, సీనియర్ సిటిజన్స్ సమయాన్ని క్రీడలకు వ్యాయామానికి కేటాయించి ఫిట్నెస్‌తో ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్ : సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కథలాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్ష ణతో కూడిన విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మెట్‌పల్లి, కోరుట్ల ఇన్‌చార్జి సీఐ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కళాధార పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు పిల్లలను ఫోన్లకు అలవాటు చేయవద్దని బాగా చదవించాలని కోరారు. సోషల్ మీడియా కు అలవాటు చేస్తే చెడు వైపు దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో బహుమతి అందుకున్న విద్యార్థుల ప్ర దర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గడ్డం భూమారెడ్డి, డైరెక్టర్ దివాకర్, ప్రిన్సిపాల్ కమలాకర్, మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, మాజీ వైస్ ఎంపీపీ గంద్ర కిరణ్‌రావు, మాజీ సర్పంచులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లిటౌన్: పండుగల నేపథ్యంలో ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి సిఐ నిరంజన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సెలవులకు వేరే గ్రామాలకు, విహారయాత్రలకు వెళ్లే వారు తాళం వేసి వెళ్లేవారు పోలీస్ వారికి తప్పని సరిగా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇంటి ఆవ రణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట గ్రామపంచాయతీలో బిల్ కలెక్టర్ పోస్టును త్వరగా భర్తీ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఇక్కడ పని చేసిన బిల్ కలెక్టర్ మధు నాలుగేళ్ల క్రితం జరిగిన బదిలీలో వెళ్లిపోయాడని, అప్పటి నుంచి పోస్టును భర్తీ చేయడం లేదని గ్రామస్థులు వాపోయారు.

బీర్‌పూర్ : కండ్లపెల్లి నాయికపు గూడెం మీదుగా చెర్లపల్లి గ్రామానికి వెల్లుతున్న అటవీశాఖ వాహనం శుక్రవారం రాత్రి అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న అటవీశాఖ సిబ్బందికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

జగిత్యాల క్రైం : భూకబ్జాలకు పాల్పడం, అధిక వడ్డీలకు రుణాలు ఇవ్వడం తదితర అభియోగాలపై బుగ్గారం మండలం కేంద్రానికి చెందిన జక్కుల లింగారెడ్డి అనే వ్యక్తిపై టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. లింగారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

కొడిమ్యాల: సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం ఇవ్వని పబ్లిక్ ఇన్ఫరేషన్ అధికారికి జగిత్యాల ఆర్డీవో ఈ నెల 18 సమాచారంతో కార్యాలయానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ శుక్రవారం తెలిపారు.

ముగ్గుల పోటీలు

జగిత్యాల అర్బన్, జనవరి (ఆంధ్రజ్యోతి) జిల్లా వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో 170 మహిళలు పాల్గొనగా సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో అల్లాల మానస, రెండవ స్థానంలో యాచమనేని పవిత్ర, మూడవ స్థానంలో కొండపల్కల మ్యాన అలాగే జూనియర్ విభాగంలో అల్లాల రస్మిత, కనపర్తి శివ కీర్తన, బట్టు అక్షయలు మొదటి మూడు స్థానాలలో వచ్చారు. సబ్ జూనియర్ విభాగంలో మెన్నేని సహస్ర, వక్రాల హరిణి, సురభి లాస్యలు మొదటి మూడు స్థానాలలో నిలిచారు.

ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు, దన్నపనేని వెణు గోపాల్ రావు, పురుషోత్తం రావు, రామచందర్‌రావు, రాజేశ్వర్ రావు, దివాకర్ రావు, ప్రశాంత్ రావు, బల్మూరి సరళ, అనిల్‌రావు, మెన్నేని సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి



కరీంనగర్ బస్టాండ్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు బస్టాండ్‌లలో అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి అన్నారు. శనివారం కరీంనగర్ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పండుగ సందర్భంగా బస్టాండ్‌లో రద్దీ ఎక్కువగా ఉండనున్నందున పిక్‌పాకెటింగ్, చైన్ స్నాచింగ్ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి, ఒకటో డిపో మేనేజర్ విజయ మాధురి, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సురేష్, కార్గో ఇన్‌చార్జి రామారావు, వన్‌టౌన్ ఎస్ఐ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల పేరు చెప్పి డబ్బులు వసూలు

● ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

కరీంనగర్ క్రైమ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని చెపుతూ వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ సాంబ మూర్తి తెలిపారు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ అజ్మత్‌పాషా శుక్రవారం తన ఆటోలో నలుగురిని తీసుకుని వేములవాడ దర్శనానికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున తిరిగి వెళుతుండగా కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని అసిఫ్‌నగర్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోను ఆపారు. తాము పోలీసులమని చెప్పి వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగారు. మొబైల్ ఉన్న ధ్రువీకరణ పత్రాలను చూపిస్తే అవి సరిపోవని, ఒరిజినల్ పత్రాలు చూపించాలని, లేకపోతే డబ్బులు చెల్లించాలని బెదిరించారు. అనుమానం వచ్చిన అజ్మత్‌పాషా వారి గుర్తింపు కార్డులు చూపించాలని అడగడంతో అక్కడి నుంచి పారిపోయారు. దీంతో అతడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన చక్రాల రాజు, గొట్టిముక్కుల విజయ్ అనే యువకులను అదుపులోకి తీసుకున్నారు.

కోడిపందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

● ఇద్దరి అరెస్టు, కోడిపుంజు స్వాధీనం



పట్టుబడిన నిందితుడు

కరీంనగర్ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని రేకుర్తిలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన లో రేకుర్తి ఇందిరమ్మకాలనీకి చెందిన సయ్యద్ బురాన్(54), ఒక మైనర్ పట్టుబడ్డారు. కోడి పుంజును, 500 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని కొత్తపల్లి పోలీసులకు అప్ప గించినట్లు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ గోపతి నరేందర్ తెలిపారు. నిందితులపై కొత్తపల్లి పోలీసుఠాణాలో సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశామని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

శంకరపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గుట్టపైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామా నికి చెందిన పేరాల శ్రీకాంత్‌రావు (41) ఈ నెల 9న రాత్రి కొత్తగట్టు గుట్ట మీద పురుగుల మందు తాగి తండ్రి ప్రభాకర్‌రావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని శ్రీకాంత్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, మృతిపై ఎలాంటి అనుమానం లేదని, మృతుడి తండ్రి ప్రభాకర్‌రావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

గూడ్స్ వ్యాన్‌ను ఢీకొన్న లారీ : డ్రైవర్‌కు తీవ్రగాయాలు.

మానకొండూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ సమీపంలో గూడ్స్ వ్యాన్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ నుంచి కరీంనగర్ వెళ్తున్న గూడ్స్ వ్యాన్‌ను హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాను బోల్తా పడగా డ్రైవర్ సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగరేణి సెక్యూరిటీగార్డు ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 ఏరియా ఎస్అండ్‌పీసీ విభాగం సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆవుల శివప్రతాప్(49) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని చౌరస్తా ఏరియాలో ఉండే శివప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో శివప్రసాద్ ఆచూకీ కోసం గాలించారు. గోదావరిఖని మిలీనియం క్వార్టర్స్ వెనక చెట్ల పొదల్లో చెట్టుకు లుంగీతో ఉరి వేసుకున్న శివప్రసాద్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

సోషల్ మీడియాలో అసభ్యకరంగా మహిళల ఫొటోలు

జగిత్యాల క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దొంగచాటుగా మహిళల ఫొటోలు తీసి, ఇన్‌స్టాగ్రాంలో పోస్టుచేసిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించిన బాధిత మహిళలు జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా మార్కెట్, బస్టాండ్, షాపింగ్ మాల్ తదితర ప్రాంతాల్లో సంచరించే మహిళల ఫొటోలను వారికి తెలియకుండా దొంగచాటుగా తీస్తూ వాటిని ఇన్‌స్టాగ్రాంలో పోస్టు చేస్తున్నాడు. మహిళల ఫొటోలు ఇన్‌స్టాగ్రాంలో చూసి బాధిత మహిళలు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. సంబంధిత ఐడీని గుర్తించి పోస్టులు చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తంగళ్లపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. శనివారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. రెండు వాహనాలను సీజ్ చేశామని, విభూతి రాజేష్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

పుస్తెల తాడు అపహరణ

ధర్మపురి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుగుణమ్మ అనే మహిళను గుర్తు తెలియని మహిళ కత్తితో బెదిరించి రెండు తులాల బంగారు పుస్తెల తాడు శనివారం అపహరించింది. మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న సుగుణమ్మ వద్దకు సదరు మహిళ వచ్చి కత్తి చూపించి బెదిరించింది. అనంతరం ఆమె మెడలోని పుస్తెల తాడు ఎత్తుకెళ్లింది. విషయం తెలుసుకున్న ఎస్సై ఉదయ్‌కుమార్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కథలాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాల క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా బైకులు ఢీకొన్న ఘటనలో శనివారం సాయంత్రం బీమారం మండలం రాజలింగంపేటకు చెందిన గుగ్గిళ్ల గంగరాజం (52) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో రాంచంద్రం కథనం ప్రకారం.. గంగరాజం చింతకుంటకు బంధువుల ఇంటికి వెళ్లాడు. బైక్‌పై తిరుగు ప్రయాణంలో తాండ్ర్యాల క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన రుద్రంగికి చెందిన వ్యక్తి వేగంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన గంగరాజంను ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.


నరసింహుడి సన్నిధిలో లోకాయుక్త చైర్మన్ పూజలు



లోకాయుక్త వెంకటరాములును సన్మానిస్తున్న ఈవో సంకటాల శ్రీనివాస్

ధర్మపురి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని తెలంగాణ లోకాయుక్త చైర్మన్ జస్టిస్ సీవీ వెంకటరాములు శనివారం సందర్శించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణయ్య, సూపరిం టెండెంట్ ద్యావల్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంబరాల సంక్రాంతి



● ముగ్గుల ప్రాశస్త్యం....

కరీంనగర్ కల్చరల్: సంక్రాంతి లక్ష్మీ ఆగమనానికి సంకేతం. శ్రీమన్నారాయణునితో కలిసి లక్ష్మీదేవి రంగురంగుల ముగ్గుల రథానెక్కి వస్తుందంటారు. ఈ రోజు ముగ్గులకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. పూర్వకాలం ఒక గ్రామంలోని వాడలో తొలి ఇంట వేసిన రథం ముగ్గును కలుపుతూ అన్ని ఇళ్ల వారు ముగ్గులను వేస్తూ అందరికీ శుభాలు కలగాలని ఆశించేవారు. ఇప్పుడు ఎవరి ఇళ్ల ఎదుట వారు అందమైన విభిన్న రూపాల్లో వివిధ రంగులతో ఉన్న ముగ్గులు వేస్తున్నారు. సామాజిక ప్రసార మాధ్యమాల్లో వారు వేసిన ముగ్గులను పెట్టి ఆనందిస్తున్నారు. లక్ష్మీతోపాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇంటికి వచ్చి శుభాలనిస్తారనే భావనతో ప్రతి ఇంటిని ఆవు పేడతో అలికి ముగ్గులు పెట్టి పేడతో గొబ్బెమ్మలను తయారు చేసి, పసుపు కుంకుమలను అలంకరించి కూరపిండి ఆకు, రేగుపళ్లు, నువ్వులు పెట్టి ముగ్గులో ఉంచుతారు. రాక్షసుల బాధ భరించలేని లక్ష్మీదేవి గోమయంలో దాగి ఉండగా ఆ రూపమే గొబ్బెమ్మ అని చెప్పుతూ పూజించే సాంప్రదాయం అనాదిగా వస్తుంది. చిన్నా పెద్దా తలంటు స్నానాలాచరించి, నూతన వస్త్రాలు ధరించి పెద్దలకు నమస్కరించి తమ పితృ దేవతలకు ఉత్తమ లోకాలు ప్రాప్తించాలని అనేక దానాలు చేస్తారు. సకల సౌభాగ్యాలు కలగాలని పిండి వంటలు చేసి పితృ దేవతలకు, నివేదన చేసి తాము తింటారు. హరిదాసులు, గంగి రెద్దుల వారు, బసవన్నలు, జంగమ దేవరలు, బుడబుక్కల వారికి ధాన్యాదులు దానంచేస్తారు. మహిళలు పౌష్య లక్ష్మికి స్వాగతం పలుకుతూ భర్తలు పండించిన ధాన్యాదులను గాదెలలో నింపుకొని మురిసిపోతారు. మహిళలు, యువతులు నోములు పంచుకొని వాయినాలు ఇచ్చుకొని పెద్దల, ముత్తైదువుల ఆశీస్సులు పొందుతారు.







● బసవన్నల సందడి

సిరిసిల్ల (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేళ గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలతో గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంటుంది. సంక్రాంతి పండుగకు రైతుల కష్టానికి ప్రతి ఫలంగా ధాన్యం ఇంటికి చేరుతుంది. ఈ క్రమంలో గంగిరెద్దులవారు సంక్రాంతి పండుగకు కొన్ని రోజుల ముందు నుంచే ఊరూరా సంచారం చేస్తారు. మూడు నాలుగు కుటుంబాలు గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తాయి. ప్రదర్శనలిస్తూ ఆ ఊరు జనం ఇచ్చే ధాన్యం, డబ్బు తీసుకుంటాయి. ఈ సందర్భంగా బసవన్నలను ప్రత్యేకంగా అలంకరిస్తారు. గంగిరెద్దులవారు సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగుంట, నెత్తిన రంగుల తల గుడ్డా, మూతి మీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, వారు వీరు ఇచ్చిన నల్లకోటు, భుజం మీద కండువ, చేతికి వెండి మురుగులు, నోసట నామాలతో కనిపిస్తారు. వారి ఆటల్లో ఎద్దు నోటిలో తమ మెడను ఇరికించి చూపిస్తారు. వాయిద్యానికి అనుకూలంగా గజ్జెలతో బసవన్న నృత్యం చేయడం ఆకట్టుకుంటుంది.

- ఇళ్లలో పిండివంటల ఘుమఘుమలు
- గ్రామాల్లో గంగిరెద్దులు.. హరిదాసులతో పండుగ శోభ
- వాకిళ్లలో రంగవల్లులు
- నోముల పంపిణీకి అతివలు సిద్ధం

● హరిదాసులు ప్రత్యేక ఆకర్షణ




నులి వెచ్చని చలిమంటలు.. ఆడపడుచుల వేలి కొసలలో రంగువల్లుల రూపంలో దాగిన అద్భుత ప్రతిభ.. ఇళ్ల ఎదుట ఇంద్రధనుస్సుల వంటి ముగ్గులు.. నింగిన గాలి పటాలై ఎగిరే మనసులు.. పసడి పంటలు.. భోగి పండ్లు, బొమ్మల కొలువులు, పిండి వంటలు, గొబ్బిళ్లు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, బుడుబుక్కల వారి ఢమరుక శబ్దాలు, ఆలయాల్లో జే గంటలు.. ఇదే తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి. నూతన క్రాంతి పథంలో పయనించేందుకు సంక్రాంతి పర్వదినం రాబోతుంది. ఈ పండుగకు మహిళలు, యువతులు ముగ్గులతో, చిన్నారులు, యువత నింగిలో పతంగులను ఎగురవేస్తూ స్వాగతం పలుకుతున్నారు.



● కనువిందు చేసే పతంగులు...

సాయంత్రం చిన్నారులు, యువత గాలి పటాలనెగరేస్తూ విశాల విశ్వంలో తామొక్కరే అన్నట్లుగా ఆనందంతో, ఆహ్లాదంతో ఊహల్లో తేలిపోతారు. ఇదో ఘనంగా న్విహించే వేడుక. పతంగులను తయారు చేయడానికి, కొనడానికి ముందస్తుగానే సిద్ధమవుతారు. కొన్ని ప్రాంతాల్లో పంతంగుల పోటీలు కూడా నిర్వహిస్తారు. విభిన్న ఆకృతుల్లో పతంగులను తయారు చేసి లేదా కొని కనువిందు చేసే వాటిని విశాల ఆకాశంలో వదులుతూ వాటి పయనాన్ని చూస్తూ ఆనందిస్తారు. ఎంత ఎత్తుకు ఎగిరితే అంత గొప్పగా భావిస్తారు. సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయనే సూచన మేరకే ఈ పతంగుల ఎగిరివేత అని అంటుంటారు.







● రెడీమేడ్ ఫుడ్స్‌కు గిరాకీ

● మార్కెట్‌లో సందడి

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ వచ్చేసింది. ఈ పండుగకు కావాల్సిన ముగ్గులు, నోములు, పూలు, పండ్లు, వస్త్రాల కొనుగోళ్లు మార్కెట్‌లో జోరుగా సాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా కొనుగోళ్లతో మార్కెట్ కిటకిటలాడుతోంది. ఏ షాపు చూసినా జనంతో నిండుగా కనిపిస్తోంది. 13, 14, 15 తేదీల్లో పండుగను జరుపుకోనున్నారు. ఈ దిశలో కొనుగోలు కాస్త ముందుగా జరిగితే బాగుంటుందని భావించిన జనం పండుగకు కావల్సిన వస్తువుల కొనుగోళలలో నిమగ్నమయ్యారు.

● ముగ్గుల రంగులు...

టవర్‌సర్కిల్, పొట్టి శ్రీరాములుచౌక్, మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయం ప్రాంతంతోపాటు రోడ్లపై ముగ్గుల రంగుల షాపులు వెలిశాయి. మహిళలు ముగ్గుల కోసం రంగులు కొనుగోలు చేస్తున్నారు. మెరుపుల కలర్‌లు పావు కిలో ప్యాకెట్ 20 నుంచి 30 రూపాయల వరకు పలుకుతుండగా మామూలు రంగులు 50 గ్రాములకు 20 రూపాయలు పలుకుతున్నాయి.



ముగ్గుల సాంచెలు, గిరకలు 10 నుంచి 25 రూపాయల వరకు లభిస్తున్నాయి.

● నోములకు గిరాకీ బాగా పెరిగింది. పలు ప్రాంతాల నుంచి నోము వస్తువులు తీసుకువచ్చి మార్కెట్‌లో 10 రూపాయల నుంచి 3 వేల వరకు అమ్ముతున్నారు. చిన్నగిన్నెలు, స్టీల్ సామగ్రి, పూజా సామగ్రి, ప్లాస్టిక్ వస్తువులు, దేవతావిగ్రహాలు, మొంటెల వాయినాలు లభిస్తున్నాయి.

● చిలకలు, బత్తీసలు...

పిల్లలకు భోగి పండ్లతో పాటు చిలకలు, బత్తీసల దండలు వేయడం ఆచారంగా వస్తోంది. మహిళలు నోములలో చిలకలు ఉంచి ఇస్తారు. చిలకలకు, బత్తీసలకు గిరాకీ పెరిగింది. 40 రూపాయలకు పావుకిలో చొప్పున అమ్ముతున్నారు.

● పూలు, పండ్లు... గొబ్బెమ్మల సామగ్రి...

మార్కెట్‌లో పూలు, పండ్లు విరివిగా లభిస్తున్నాయి. బంతి, చేమంతి, మల్లె వంటి పూలు 35 రూపాయలకు పావుకిలో, 50 రూపాయలకు అరకిలో చొప్పున అమ్ముతున్నారు. గ్రామీణ ప్రాంత రైతులు, మహిళలు గొబ్బెమ్మల సామాగ్రి, మామిడాకు, గుమ్మడికాయలు, రేగుపండ్లు, గరిక, నవ ధాన్యాలు, పేడ తెచ్చి అమ్ముతున్నారు. రేగు పండ్లకు గిరాకీ పెరిగింది.



● నోరూరించే పిండి వంటలు



జగిత్యాల (ఆంధ్రజ్యోతి): సరదాల సంక్రాంతి వచ్చింది. ప్రతి ఇల్లు పిండి వంటలతో ఘుమఘుమలాడుతోంది. చకినాలు, గారెలు, అరిసెలు, నువ్వుల లడ్డులు, మురుకులు, కారప్పూస, జంతికలు,చేగోడీలు, రవ్వ లడ్డులు, కారా బూంది, బూంది లడ్డూలను మహిళలు తయారు చేస్తున్నారు. మూడు రోజుల సంక్రాంతి పండుగ కోసం పిండి వంటల తయారీలో మహిళలు బిజిబిజీగా కనిస్తున్నారు. ఇంటిల్లిపాది పిండి వంటలు తయారు చేయడంలో నిమగ్నం కావడంతోపాటు ఇరుగు, పొరుగు, కాలనీ వాసులు, బంధు, మిత్రులను ఆహ్వానిస్తారు. మరికొందరు ఉరుకులు, పరుగుల జీవితంలో ఇంట్లో వంటకాలు చేసుకోవడం తగ్గించి మార్కెట్లో దొరికే వాటిపైనా ఆధారపడుతున్నారు. ఇంట్లో మూకుడు పెట్టాలని, పిండి వంటలు చేయాలని వస్తున్న సంప్రదాయం ప్రకారం పలువురు మహిళలు పిండి వంటలు చేస్తున్నారు.

సంక్రాంతి వస్తే సందడే సందడి



- అయిత అనిత, జగిత్యాల

సంక్రాంతి వచ్చిందంటే చాలు.. ఏ ఇంట చూసినా సందడి కనిపిస్తుంది. వారం రోజుల ముందు నుంచే పిండి వంటల తయారీ, కొత్త బట్టలు కుట్టించుకోవడం, పతంగులు, గంగిరెద్దుల ఆటలు పండగకు మరింత శోభను తెచ్చిపెడుతాయి. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలను మరవకుండా ఇంటిల్లిపాది ఆనందాలతో గడుపుతుంటారు.

పిండి వంటలు చేయాల్సిందే..



- అడిగొప్పుల రజిని, జగిత్యాల

సంక్రాంతి పండుగకు ప్రతీ యేటా తప్పనిసరిగా పిండి వంటలు చేయాల్సిందే..సకినాలతో పాటు అరిసెలు, గారెలు, మురుకులు, పిండి వంటలను తయారు చేస్తుంటాము. పిండి వంటలు తయారు చేసే క్రమంలో ఇరుగు పొరుగును పిలుచుకోవడం, వాళ్ల ఇంట్లో తయారీ సమయంలో మేము వెళతాం.



● అతివలకు ప్రత్యేకం.. నోములు

సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు మహిళలు నోముకోవడం ఆనవాయితీ. ఈ ఆచారం తరతరాలుగా వస్తోంది. నేటి తరం వారు కూడా దీన్ని ఆచరిస్తూ పండుగల విశిష్టత, సంప్రదాయ, ఆచార వ్యవహారాలను భవిష్యత్తు తరాలవారికి అందిస్తున్నారు. ఆడపడుచులకు వివాహం కాగానే సంక్రాంతి పండుగకు పుట్టింటి నుంచి నోము తెచ్చుకుంటారు. లేదా అత్తవారింటి నుంచి సంక్రమిస్తుంది. పెళ్లికాని యువతులు వివాహం కోసం, పెళ్లి అయిన వారు సంతానం కోసం, ముఖ్యంగా సౌభాగ్యం కోసం నోముకుంటారు. చుట్టుపక్కల వారందరిని పిలిచి రకరకాల పాత్రలు, బొమ్మలను పంచుతారు. లేదా నోముకున్న వారే ఇంటింటికీ తిరుగుతూ ఇస్తూ ఉంటారు. సంక్రాంతి నోములతో ప్రతీ తెలుగు వారి ఇంట కుటుంబ సభ్యులు, బంధువులతో సందడిగా మారుతుంది. ఏ నోము అయినా ముఖ్యంగా సౌభాగ్యం లక్ష్యంగా చేస్తుంటారు.

సౌభాగ్యవతి నోములు



- బాదం వాణి, సుల్తానాబాద్

సంక్రాంతి పండుగ రోజున సౌభాగ్యవతి నోము నోచుకుంటారు. తమ ముత్తయిదవతనం కలకాలం ఉండాలని ఈ వ్రతం చేస్తారు. ఇందులో నువ్వులు బెల్లంతో నోచుకుంటారు. దువ్వెనలు, అద్దాలు, కాటుక, గాజులు, పసుపు, కుంకుమ వంటి ముత్తైయిదవతనానికి సంబంధించిన వాటితో నోచుకుంటారు. మకర సంక్రమణ రోజే ఇవి నోచుకుంటారు.

కూడారై నోము అత్యంత ప్రధానమైనది




- సౌమిత్రి హరిణి, గృహిణి సుల్తానాబాద్

సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు నోచుకునే అత్యంత ప్రధానమైన నోము కూడారై నోము వ్రతం.. సంక్రాంతికి ముందే నోముకు సంబంధించిన పనులను పూర్తి చేసుకుంటాము. నూట ఎనిమిది గంగాళాలతో మహిళలు ఈ వ్రతం చేసుకుంటారు. చాలామంది ఎంతో వైభవంగా కూడారై నోములో పాల్గొని తరిస్తారు.

నవజాతి నిర్మాణానికి పునాది

● స్వామి బోధనలు యువతకు దిక్సూచి ● నేడు వివేకానంద జయంతి



సిరిసిల్ల/గణేశ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): "బలమే జీవనం.. బలహీనతే మరణం.. సమస్త శక్తి నీలోనే ఉంది.. లక్ష్యసాధనలో ఎన్ని కష్టాలైనా అనుభవించేందుకు సిద్ధంగా ఉండు.. కానీ విజయాన్ని సాధించేదాకా విడిచి పెట్టకు". అని నిత్యం యువతను ప్రేరేపిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.. స్వామి వివేకానంద. ఆయన స్వరం ప్రపంచవ్యాప్తంగా యువకుల గుండెల్లో ప్రేరణగా నేటికీ నిలిచి ఉంది. ప్రపంచ దేశాలు స్వామి వివేకానంద అందించిన సూక్తులను యువతకు బోధిస్తూ ఎంతో మందిని ఉత్తేజపరుస్తున్నారు. యువతను మేల్కొల్పడానికి స్వామి వివేకానంద ఆశాజ్యోతిగా కనిపిస్తున్నారు. 39 ఏళ్ల జీవితంలో భారతజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. జనవరి 12న వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

● స్వామి వివేకానంద జీవితం

స్వామి వివేకనంద అసలు పేరు నరేంద్రనాథ్ దత్త. ఆయన తల్లిదండ్రులు భువనేశ్వరిదేవి విశ్వనాథ్ దత్తలు. 1863 జనవరి 12న పశ్చిమబెంగాల్‌లోని కలకత్తా నగరంలో జన్మించారు. రామకృష్ణ పరమహంసకు ప్రియమైన శిష్యుడు స్వామి వివేకానంద. ఎన్నో దేశాలు తిరిగి భారతదేశపు ఆధ్యాత్మిక విలువలని వివరించారు. స్వామిజీ చికాగోలో చేసిన ఉపన్యాసం ఇప్పటికీ చరిత్రలో నిలిచిపోయింది. వివేకానందుడు గొప్ప తాత్వికుడు. తత్వ శాస్త్రంలోనే కాక సామాజిక, రాజకీయంగా ఉపయోగపడే బోధనలు చేశారు.

● యువతకు సందేశం

యువశక్తి తలుచుకుంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని వివేకానందుడు పేర్కొన్నాడు. ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనసులో ఉన్న యువత ఈ దేశానికి కావాలని వివేకానందుడు కోరుకున్నారు. వజ్ర సంకల్పం కలిగి ఉండాలని సూచించారు. తన అద్భుత ప్రసంగంతో పాశ్చాత్యుల హృదయాలను సైతం చూరగొన్న భారతీయ తత్వవేత్త. యువతను ప్రోత్సహించిన స్వామి వివేకానంద కేవలం ఒక సన్యాసి మాత్రమే కాదు. గొప్ప దేశభక్తుడు, మేధావి, గొప్ప దార్శనికుడు. అందుకే ఆయన భవిష్యత్ తరాలకు మార్గదర్శి అయ్యారు.

వివేకానంద బోధనలు ఇష్టం

సిరి చందన, విద్యార్థిని



స్వామి వివేకానంద బోధనలు, సూక్తులు చాలా ఇష్టం. వీటి ద్వారా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. సేవాగుణం అలవడుతుంది. విద్యార్థుల కోసం స్వామి వివేకానంద జీవిత విశేషాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తే బాగుంటుంది.

సమాజంలో గౌరవంగా జీవించాలి

లింగంపల్లి మహేశ్వరి, విద్యార్థిని



స్వామి వివేకనంద బోధనలను అలవర్చుకొని గౌరవంగా జీవించాలి. దేశ అభివృద్ధికి వెన్నుముకగా నిలవాలి. పర్యావరణ పరిరక్షణ, అవినీతి నిర్మూలన కోసం పనిచేయాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

వి.శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్



నేటి పోటీ ప్రపంచంలో యువత అడ్డంకులను ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోవాలి. ప్రతి ఒక్కరూ వివేకానందుడి బోధనలతో ప్రేరణ పొందాలి. క్రమశిక్షణతో యువత మెరుగైన సమాజం కోసం పాటు పడాలి. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి.

సాయం కోరితే స్పందించాలి

గాలిపెల్లి కుమార్, కరీంనగర్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి



ఆపదలో ఉన్నవారు సాయం కోరితే యువత తక్షణమే స్పందించాలి. స్వామి వివేకానంద స్ఫూర్తితో ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడుతున్నా. వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నా.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● ప్రముఖుల పూజలు

కొండగట్టు అంజన్నను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ లోకాయుక్త జస్టిస్ చింతపల్లి వెంకట్‌రాములు, రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. వేర్వేరుగా కొండపైకి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వారి వెంట సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కు మార్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

బీర్‌పూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో జారిపడి కొల్వాయి గ్రామానికి చెందిన కస్తూరి వెంకన్న (47)అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తుంగూర్ గ్రామ శివారులోగల తన పొలానికి కాలువ ద్వారా నీరు వస్తున్నాయో లేదో చూడడానికి వెంకన్న వెళ్లాడు. ఒడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు.

భూ కబ్జా కేసులో ఇద్దరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడిన సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన సలేంద్రి బాలరాజు, గంగుల బాలయ్యను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరు శివారులో సర్వే నంబరు 408లో 2.5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని సిరిసిల్ల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. దర్యాప్తులో బాలరాజు, బాలయ్యపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

వెల్గటూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట స్టేజి వద్ద శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో పలువురికి గాయాలు కాగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కిషన్‌రావుపేటకు చెందిన దంపతులు నర్సింహచారి, నాగరాణిలు ద్విచక్ర వాహనంపై చొప్పదండి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కిషన్‌రావుపేట స్టేజి వద్ద వారి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇరువురికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. వరంగల్- రాయపట్నం రాష్ట్ర రహదారిపై కిషన్‌రావుపేట స్టేజీ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. స్తంభంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను సంక్రాంతి సెలవులకు తీసుక వెళ్లడానికి గోదావరిఖని ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు ఆటోలో వస్తున్నారు. మార్గ మధ్యలో కిషన్‌రావుపేట వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కాల్చివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 83 కేసుల్లో పట్టుకున్న దాదాపు 26కిలోల 437 గ్రాముల గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శనివారం కాల్చివేశారు. మానకొండూరు మండలంలోని ఈదులగట్టపల్లిలో వెంకటరమణ ఇన్సినేటర్స్ కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీలో నేషనల్ డ్రగ్ డిస్పోజల్‌లో భాగంగా నిషేధిత గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో తగులబెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీసీఆర్‌బి సీఐ శ్రీనివాస్, ఆర్ఐ రమేశ్ పాల్గొన్నారు.

ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అదనపు అధికారిగా శ్రీవాణి



శ్రీవాణికి నియామక పత్రం ఇస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శాతవాహన విద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ కోడూరి శ్రీవాణిని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అదనపు అధికారిణిగా, అర్థశాస్త్ర విభాగపు అధిపతిగా నియమిస్తూ రిజిస్ట్రార్ రవికుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. పారదర్శకంగా విశ్వ విద్యాలయ పరీక్షల నిర్వహణకు కృషి చేస్తానని శ్రీవాణి తెలిపారు.